క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న నాగబాబు కుటుంబ సభ్యులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. పాలకొల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుబ్బల నాగబాబు ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సోమవారం అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తామని వారు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు



పాలకొల్లు సబ్బేవారిపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని సబ్బేవారిపేటలో 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి కాలిపోయి విద్యుత్ సరఫరాకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో గృహ యజమానులకు విద్యుత్ సరఫరాతో పాటు సబ్బేవారిపేట, ధాంపేట తదితర ప్రాంతాలకు మంచినీటి సరఫరాకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా) సూచనల మేరకు రూరల్ పంచాయతీ ఎలక్ట్రికల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ప్రజలకు మంచినీటిని సరఫరా చేశారు.

ఫిల్టర్‌బెడ్స్‌లో పేరుకుపోయిన నాచు



పాలమూరులో ఫిల్టర్ బెడ్స్‌లో నాచు పేరుకుపోయిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరులో గత కొంతకాలం నుంచి ఫిల్టర్ బెడ్స్‌లో నాచు పేరుకుపోయింది. దీంతో మంచినీరు ఫిల్టర్ కావడం లేదు. చెరువులో నీటిని ఫిల్టర్ బెడ్స్ ద్వారా ప్రజలకు వీధి కుళాయిల ద్వారా, వ్యక్తిగత కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నీరు ఫిల్టర్ కావడం లేదు. ఫిల్టర్ బెడ్స్‌తో ఇసుక మార్చాలి. దీనికి తోడు ఫిల్టర్ బెడ్స్‌లో అట్టలా నాచు పేరుకుపోయి ఉంది. ప్రతీ రోజు ప్రజలకు ఈ నీటినే సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని స్నానాలకు, ఇతర గృహ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. స్నానాలకు వినియోగించడం వల్ల శరీరంపై దురదలు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామానికి చెందిన బుంగ పవన్‌కుమార్ తెలిపారు. తక్షణం ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మేడపాడులో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న భీమవరం రాధాకృష్ణ నేత్ర వైద్యశాల సిబ్బంది

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని గరువు ప్రాంతంలో ఉన్న శెట్టిబలిజ రామాలయం వద్ద ఆదివారం భీమవరం రాధాకృష్ణ నేత్ర వైద్యశాల సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది తలనొప్పి, చత్వారం, కళ్ల మసగ, మెడ నరాలు లాగడం వంటి సమస్యలతో బాధ పడుతున్న 45 మందికి ఉచితంగా కళ్ల పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందికి కంటిలో శుక్లాలు ఉండుటతో శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. మరొక 16 మందికి కళ్లజోళ్లు పడతాయని వివరించారు. వీరందరికీ సబ్సిడీపై శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు ఇస్తామని శిబిరం కోఆర్డినేటర్ తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

యలమంచిలి: నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో ఉన్న ఒక కొబ్బరితోటలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

దశాబ్దాల కాలం నాటి సమస్యలకు మోక్షం

- మార్టేరు సెంటర్ అభివృద్ధి పరుగులు
- 60 గ్రామాల ప్రయాణికులకు తీరనున్న వెతలు

పెనుమంట్ర: ఆచంట, పాలకొల్లు, తణుకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 60 గ్రామాలకు పైగా ప్రయాణికులకు ప్రధాన కూడలిగా ఉన్న మార్టేరు సెంటర్‌లో ప్రయాణికులు అనేక సమస్యలతో సతమతవుతున్నారు. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో సెంటర్‌లో ఆచంట రోడ్డులో సులభ్ కాంప్లెక్స్, బస్‌షెల్టర్, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం ద్వారా సెంటర్‌లో ప్రయాణికుల సమస్యలకు చెక్ పెట్టగలిగారు. ఈ సెంటర్‌లో ప్రయాణికులు ఎంతో కాలంగా ట్రాఫిక్, మరుగుదొడ్లు, జేబు దొంగల సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఈ సెంటర్ నుంచి ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఈ సెంటర్‌కు పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వందలాది ఆర్టీసీ పాసింజర్ సర్వీసులతో పాటు హైదరాబాదు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా ఈ సెంటర్ నుంచి వెళుతుంటాయి. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన 60 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు ఈ సెంటర్‌నుంచే ప్రయాణిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటూరు. ఇంత ప్రయాణికుల రద్దీ ఉన్న ఈసెంటర్ ఆక్రమణకుల గుర్రై తరచూ ట్రాఫిక్ సమస్యలతో గంటల తరబడి మార్టేరు నుంచి పెనుగొండ, ఆలమూరు, కవిటం, పండిత విల్లూరు గ్రామాల వరకు వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.





మార్టేరు సెంటర్‌లో ఆచంట రోడ్డులో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్, బస్‌స్టేషన్, షాపింగ్ కాంప్లెక్స్, మార్టేరు వైఎస్సార్ సెంటర్ పాలకొల్లు రోడ్డులో చెరుకువాడ శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో నిర్మిస్తున్న బస్‌షెల్టర్

రాజన్న ప్రభుత్వంలో ప్రయత్నం

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చాక కొంతమేర సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి, రోడ్డును వెడల్పు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అదుపుచేయగలిగారు. ప్రస్తుత జడ్పీటీసీ, అప్పటి మార్టేరు గ్రామ సర్పంచ్ కర్రిగౌరీసుభాషిణి మహిళల అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని సెంటర్‌లో సులభ్‌కాంప్లెక్స్(టాయిలెట్స్) నిర్మించేందుకు శంకుస్థాపన చేసారు. అయినప్పటికీ స్థానిక నాయకుల అడ్డంకులతో అప్పట్లో నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. అదేవిధంగా పెనుగొండ రోడ్డులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అల్లం బులిరెడ్డి, భాస్కర్‌రెడ్డి సోదరులు రూ.లక్ష వ్యయంతో వారి మాతృమూర్తుల స్మారకార్థం పెనుగొండ రోడ్డులో బస్ షెల్టర్ కూ డానిర్మించారు. అయితే అప్పటి అధికార టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు ఈ బస్ షెల్టర్‌ను పూర్తిగా తొలగించారు. దీంతో సెంటర్‌లో టాయిలెట్స్ గానీ, బస్‌షెల్టర్‌లేక ప్రయాణికులు, విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు.

జగనన్న ప్రభుత్వంలో సాకారం

అయితే గత ఎన్నికల సమయంలో చెరుకువాడ శ్రీరంగనాథరాజు మార్టేరు గ్రామస్తులకు నియోజకవర్గ మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గ్రామ సమస్యలతో పాటు సెంటర్‌లో ప్రయాణికుల సమస్యలనుకూడా దృష్టిలో పెట్టుకుని జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెంటర్‌లో ఆచంట రోడ్డులో రూ. 14 లక్షలతో అధునాతన సులభ్ కాంప్లెక్స్, జెడ్పీ, ఎంపీపీ, గ్రామ పంచాయతీ నిధులు రూ. 22.75 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను చేపట్టి పూర్తిచేయించారు. అంతేకాకుండా సుమారు రూ. 32 లక్షలు అంచాన వ్యయంతో తన సొంత నిధులు వెచ్చించి పాలకొల్లు, పెనుగొండ, అత్తిలి రోడ్లలో మూడు బస్‌షెల్టర్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి పాలకొల్లు రోడ్డులో బస్‌షెల్టర్ దాదాపు పూర్తి చేశారు. దీంతో ఈ సెంటర్‌నుంచి ప్రయాణికుల వెతలు తీరనున్నాయి.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు



జగనన్న ప్రభుత్వం వచ్చాక మార్టేరు సెంటర్‌లో అనేక సమస్యలు పరిష్కారం లభించాయి. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో నిర్మాణం చేపట్టిన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం స్థానిక అప్పటి అధికార టీడీపీ అడ్డంకులతో నిర్మాణం పూర్తి చేయలేకపోయాం. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో దశాబ్దాల కాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం ఏర్పడింది. నియోజకవర్గ ప్రజల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కర్రి గౌరీ సుభాషిణి, పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు

సమస్యల పరిష్కారం హర్షణీయం



ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న మార్టేరు గ్రామంలోని సమస్యలతో పాటు సెంటర్‌లోని టాయిలెట్స్ బస్‌షెల్టర్, సమస్యల పరిష్కారం జగనన్న పాలనలో పూర్తికావడం ఆనందంగా ఉంది. మార్టేరు అభివృద్ధి పనులు చేపట్టడాన్ని అన్ని విధాలా సహకరించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– మట్టా కుమారిరాము, సర్పంచ్, మార్టేరు

ఫ్లెక్సీ ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

పెనుగొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర సీతారామ్ డిమాండ్ చేశారు. ఆచంట మండలం పెనుమంచిలి శివారు రాయి కింద ఏరియాలో వల్లూరు కాలువపై బ్రిడ్జి దగ్గర ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దారుణమని ఆదివారం పెనుమంచిలిలో నిరశన వ్యక్తం చేశారు. దళిత ఐక్య సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. దళిత యువత సంయమనం పాటించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దళిత యువత అంతా సంఘటిత శక్తిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఐక్య దళిత సంఘ అధ్యక్షుడు అలూరి చిన్నారావు, తాడి బాల శేఖర్, పొన్న పెద నర్సింహస్వామి, కాశీ శ్రీనివాసరావు, పార్శి శ్రీనివాసరావు,, తాడి రామారావు, పార్శి రామారావు, పొన్న పెద సత్యనారాయణ, రాపాక సత్యనారాయణ, పొన్న శ్రీనివాసరావు, తాడి నాగేశ్వరరావు, పొన్న అనిల్‌కుమార్, జంగా భాస్కర్ రావు, జంగా రాముడు, జంగా లక్ష్మణుడు, తాడి సతీష్ కుమార్, కొలాటి సూర్యనారాయణ, పొన్న యోహన్ తదితరులు పాల్గొన్నారు.



పెనుమంచిలిలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నాయకులు

చీఫ్ జస్టిస్ శేషసాయికి సత్కారం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేష సాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఏపీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ గా నియమితులైన ఆకుల శేష సాయిని ఆదివారం భీమవరంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరం అనే పదంలోనే వరం ఉందని, జిల్లాల పునర్విభజన లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నూతనంగా ఏర్పడడం, ఈ జిల్లాకు భీమవరం కేంద్రం కావడం ఒక వరమైతే, భీమవరానికి చెందిన ఆకుల శేష సాయి హైకోర్టు చీఫ్ జస్టిస్ గా నియమితులు కావడం భీమవరం ప్రజలకే కాకుండా పశ్చిమగోదావరి జిల్లాకే ఖ్యాతి దక్కిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆకుల శేషసాయి మరింత ఉన్నత శిఖరాలను కచ్చితంగా అధిరోహిస్తారని ఇందులో ఎలాంటి సందేహము లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

మొగల్లులో ఘనంగా స్త్రీల సండే

పాలకోడేరు: మొగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఆదివారం స్త్రీల సండే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆరాధన, పాటలు, వాక్యము చదువుట, ప్రత్యేక ప్రార్థనలు, వాక్య సందేశం, ముగింపు ప్రార్థనలు, కానుకలు పట్టుట అన్ని కార్యక్రమాలు స్త్రీలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపే జయ పాల్గొని ప్రారంభించి వాక్య సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలోని రూతు, ఎస్తేరు, హన్నా దేవుని మార్గంలో నడిచి దేవుని దీవెనలు పొందారని వారి జీవిత చరిత్రను వివరించారు. స్త్రీలు భర్తకు లోబడి జీవించాలని అన్నారు. స్త్రీలంతా క్రీస్తు మార్గంలో నడవాలని ప్రబోధించారు. ఈ సందర్భంగా ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్యారిస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్త్రీలంతా ఐక్యతతో ఈ స్త్రీల సండే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామం రాష్ట్రం దేశం గురించి ప్రత్యేక ప్రార్థన జరిపారు. మహిళలు ఆలపించిన గీతాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కోనలపల్లి వజ్రం,నేతల శాంత కుమారి, చిల్లా మణికుమారి, పొకెర్ల అమ్మాజీ, వర్ధనపు నాగమణి, మరపట్ల నీలిమ, చిల్లా మార్తమ్మ, కేదాసి చంటమ్మ, చిగురుపాటి జయంతి, బుంగా చలపతి, చిల్లా ఝాన్సీ, కోనలపల్లి సుధారాణి, మరపట్ల చిట్టి పాల్గొన్నారు.



మొగల్లులో నిర్వహించిన స్త్రీల సండేలో గీతాలు ఆలపిస్తున్న విశ్వాసులు

దాతలూ..బాలుడిని ఆదుకోరూ..

భీమవరం అర్బన్: మండలంలోని కొమటితిప్ప గ్రామంలో ఇరుసుమండ సతీష్ కుమార్ (6) మెదడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి వల్ల సతీష్ కుమార్ మంచంపైనే అచేతనంగా ఉండటంతో తల్లిదండ్రులు ఇరుసుమండ ఆనందరావు, రూతమ్మలు తమ కుమారిడిని ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. కూలి పనులు చేసుకుని వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని నెట్టికొస్తున్న ఆనందరావు తమ కుమారుడు సతీష్ కుమార్ కోసం ఇప్పటి వరకు స్థోమతకు మించి రూ. 10 లక్షలు వరకు ఖర్చు చేశాడు. వైద్యం కోసం విజయవాడలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయిస్తున్నామని నెలకు రూ.6 వేలు వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ వ్యాధి నయం అవ్వాలంటే రూ. 10 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని అంత స్థోమత మాకు లేదని దాతలు ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో తమ కుమారుడిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



మంచంపై అచేతనంగా ఉన్న సతీష్ కుమార్

చిన్నారులు పుస్తకాలను చదవాలి



నరసాపురం లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిక్షణలో పిల్లలతో పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విద్యాభ్యాసం నుంచే చిన్నారులు పుస్తకాలను చదవడం మంచి అలవాటు అని ప్రముఖ శాస్త్రవేత్త సుబ్బారావు పేర్కొన్నారు. నరసాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులతో భాగంగా ఆదివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. పిల్లతో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్‌సింగ్, అబ్దుల్ కలాం ఆజాద్ మొదలైన వారి జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు, నీతి కథలు, వార్తా పత్రికలు, దిన, వార పత్రికలను పరిచయం చేసి విద్యార్థులతో చదివించారు. లైబ్రేరియన్ కేజేఎల్ కుమారి మాట్లాడుతూ శాస్త్రవేత్త సుబ్బారావు, మోటివేటర్‌లు నాగశ్రీ, జీవన్, సుధీర్‌మోహన్ పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



సిద్ధాంతంలో కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

పెనుగొండ: తాడిచెట్టు పడి అకాల మృతి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సిద్ధాంతంలో ఈదురు గాలులకు తాటి చెట్టు పడి మృతి చెందిన కౌలు రైతు పులి రాము కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో రైతు సంఘ పెనుగొండ మండల నాయకులు గుర్రాల సత్యనారాయణ పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

పెనుమంట్ర: మానవత స్వచ్ఛంద సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛందసేవా కార్యక్రమములు చేయడం అభినందనీయమని పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎస్ఆర్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మార్టేరులోని రోటరీ భవన్‌లో జరిగిన మానవత సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థులకు, చిరు వ్యాపారులకు తమ వంతు సహకారం అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఇంటర్‌లో 463 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేదవిద్యార్థిని కొవ్వూరి ప్రశాంతికి సంస్థ తరపున రూ.5000 నగదు, రిటైర్డ్ తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి మరో రూ.2000ల నగదును ఆమెకు సభలో పురస్కారంగా అందించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకునే పేదలకు పెద్ద గొడుగులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మానవతా సంస్థలో జీవిత మెంబర్‌గా రూ.25000 సంస్థకు అందజేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పడాల అమరనాథ రెడ్డిని సంస్థ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు చిర్ల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పోడూరు కృష్ణమూర్తి , కార్యదర్శి బానాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జె.దుర్గారావు, యోగా మాస్టర్ పడాల రామచంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, పూర్వ అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి బండి ప్రసాద్, రిటైర్డ్ ఎమ్మార్వో తామాడ సత్యనారాయణ, బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నేడు నిరసన

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని అమరావతిలో 50 వేల మంది నిరుపేదలకు సెంటు భూమి చొప్పున పంపిణీకి చర్యలు తీసుకుంటుంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహంకార పూర్తి వ్యాఖ్యలు చేయడంపై సోమవారం ఉదయం 9గంటలకు పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంవద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాక్షి, భీమవరం: పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్‌లో కొత్తగా 33 కెవి లైన్లు ఏర్పాటు నిమిత్తము 22వ తేది ఉదయం7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామలక్ష్మి నగర్, ప్రకాష్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాతల సాయం అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): హెచ్ఐవీ బాధితులకు దాతల సాయం అభినందనీయమని ఏఆర్‌టీ సెంటర్ వైద్యుడు డాక్టర్ గోవిందబాబు అన్నారు. పాజిటివ్ పీపుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవీతో చనిపోయిన వారి జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దాతల సాయంతో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కముజు శ్రీనివాసరావు, పి.శేషారాజ్యం, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు చీఫ్ విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం రూరల్: ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం ఉదయం 11 గంటలకు నరసాపురం పట్టణంలోని అల్లూరి కల్యాణ మండపంలో వార్డు వలంటీర్లకు సత్కారం కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయ వర్గా లు ఓ ప్రకటన విడుదల చేశాయి. అనంతరం సాయంత్రం 4 గంటలకు నరసాపురం మండలం మల్లవరం , మల్లవరంలంక గ్రామల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. భీమవరానికి చెందిన కొల్లాటి పెద్దిరాజు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుంటాడు. నరసింహపురం నుంచి భీమవరం వైపు వస్తుండగా వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడు కొల్లాటి పెద్దిరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం బేతపూడిలోని కొత్రపాడుకు చెందిన పైడి రాజేష్‌ను అదే గ్రామానికి చెందిన పాలపర్తి ఏలియాస్ మరో నలుగురు కలిపి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు పరస్పరం ఒక వర్గంపై మరో వర్గం ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ శిబిరం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు తెలిపారు. ట్రస్ట్ భవనంలో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్న ఈ శిక్షణకు 18 ఏళ్ల నిండి 50 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ట్రస్ట్ భవనంలో మహిళలకు రెండు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు స్కిల్ డవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా వారి ద్వారా సర్టిఫికెట్ అందిస్తారన్నారు. అలాగే శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.8 వేలు విలువైన టేబుల్, మోటార్‌తో పాటు కుట్టు మిషన్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న మహిళలకు శివప్రసాద్ 72075 75616 సంప్రదించాలన్నారు.

రేపు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం సాయంత్రం మేంటీవారి తోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరిశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు ఉన్న చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం , భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.